మౌనరాగాలు

సరోజ మనస్సు ఒక్కసారి భగ్గుమంది.

ఆమె చెవుల్లో ఆనంద్ చెల్లెలు రమణి మాటలే గింగురుమంటున్నై. "పెళ్ళయ్యాక కూడా వుద్యోగం చెయ్యాలనుకుంటున్నావా నువ్వు?".

కనీసం 'మీరు' అని కూడా సంబోదించకుండా అడిగిన ఆ ప్రశ్నలో ఓ విధమైన 'గీర' కనబడింది సరోజకు. అయినా నెమ్మదిగా "అప్పటి పరిస్థితి బట్టి" అన్నది.

రమణి అంతటితో వూరుకోలేదు. "పెళ్ళయ్యాక కూడా నీచేత వుద్యోగం చేయించాల్సిన ఖర్మేం లేదు మాకు" కళ్ళెగరేస్తూ 'నేను గాక యిలా మాట్లాడుతున్నాననే' భావం మొహంలో ప్రస్ఫుటింపచేస్తూ అన్నది రమణి.

సరోజకు కోపం పొంగుకొచ్చింది. తమాయించుకుంది, రమణి ఆఫీసర్ భార్య అయితే అవుగాక. ఇంత మర్యాద లేకుండా మాట్లాడటాన్ని భరించలేకపోయింది.

రవి ఆనంద్‌ని ఏదో ప్రశ్నించడంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

"ఏమ్మా, సరోజా భోజనం చేశావా?" సరస్వతమ్మ మాటలతో ఈ లోకంలో పడింది - సరోజ.

"ఇంకా లేదండీ, చెయ్యాలి".

"పొద్దుపోతోంది చెయ్యి, అది సరే గానీ, ఇంతకీ ఏం నిర్ణయం తీసుకున్నావ్? అబ్బాయి బాగానే వున్నాడు. ఒప్పుకున్నట్లేనా?".

"లేదు పిన్నిగారూ, యింకా నిర్ణయించుకోలేదు. ఎటూ తేల్చుకోలేకపోతున్నాను. అతని చెల్లెలి ధోరణి చూశారు కదా. ఆ అమ్మాయి అసలు మర్యాద తెలీని మనిషిలా అనిపిస్తోంది. ఆ అమ్మాయి మాటల్ని తలుచుకుంటే

నా మనస్సు వెనక్కి అడుగేస్తోంది. ఈ సంబంధం నేను చేసుకోలేననిపిస్తోంది. అయినా లోగడ ఆరుసార్లు జరిగిన విషయాల్ని, నా నిర్ణయాల్ని మీకు చెప్పాను గదా! నాదే తప్పనిపిస్తోందా మీకు?" సరోజ మాటల్లో రోషం తొంగిచూసింది. ప్రక్క వరండాలోంచి సరోజ మాటల్ని వింటున్న రవి నెమ్మదిగా అక్కడికి చేరేడు.

"ఆ అమ్మాయి రేపో మాపో అత్తవారింటికి వెళ్ళిపోతుంది. నీకు బాధేముంది. వేరే బాదరబందీ లేమీ లేవు. ఆమె వచ్చినప్పుడు కాస్త జాగ్రత్తగా వుంటే సరి, నీ మనస్సు తెలుసుకుని తనే నీతో కలిసిపోతుంది. ఈ మాత్రం దానికి ఇంత ఆలోచన అనవసరం సరోజా". నెమ్మది మీద ఎలాగైనా సరోజను ఒప్పించాలనే ధోరణిలో ఉన్నాడు రవి.

సరోజ ఏమీ మాట్లాడకపోవడంతో, "సరే నీ యిష్టం, ఏమాలోచిస్తున్నావో, ఏం నిర్ణయించుకుంటావో, నీకు వెనకాల ఎవ్వరూ లేరన్నావ్ కనుక, నువ్వొ ఒకింటిదానివయితే చూడాలనుకున్నాను. కానీ, ఎప్పటికేది జరగాలో అప్పటికే జరుగుతుంది. పద రవీ" అంటూ వెళ్ళిపోయింది - సరస్వతమ్మ.

....

"ఆడదానికి వివాహం అంత అవసరమా రవీ."

సరోజ మాటలకు చిన్నగా నవ్వేడు రవి.

"ఒక్క ఆడదానికే పెళ్ళి అవసరం అని ఎవరన్నారు - సరోజా ! ఆడదానికి వివాహం ఎంత అవసరమో మగవాడికి అంతే అవసరం. ఇందులో ఎవరికి అవసరం, ఎవరికి అనవసరం అనే ప్రశ్నకు తావేలేదు. వయసులో వున్నప్పుడు తెలియకపోయినా, జీవితంలో ఎప్పటికైనా ఒక తోడు అవసరం అనే నా అభిప్రాయం".

"మరి ఇన్ని అభిప్రాయాలుంచుకుని నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదు?"

సరోజ ప్రశ్నకు తడబడ్డాడు రవి.

"ఇప్పుడు చేసుకోవాలనే అనుకుంటున్నాను"

సరోజ మరేం మాట్లాడలేదు.

"సరే నేను వెళ్తున్నాను. మరీ పిచ్చిగా ఆలోచించకు. రేపు ఆదివారం కదా, నీ అభిప్రాయాన్ని ఎల్లుండి ఆఫీసులో చెప్పమన్నాడు ఆనంద్".

సరోజ ఇంకా ఆలోచనలోనే వుండిపోయింది.

క్షణాల తర్వాత నెమ్మదిగా వెళ్ళిపోయేడు రవి.

సరోజ ఆలోచనల్లో గతం చోటు చేసుకుంది.

మొదటిసారి పెళ్ళి చూపులప్పుడు రామ్మూర్తి వచ్చేడు. అతను ఎం.కాం. ప్యాసై ఇంకా ఉద్యోగ అన్వేషణలోనే ఉన్నాడు. కొత్తల్లో పరిస్థితి సరదాగా వున్నా, పోనుపోను అతను ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకు లోనయ్యే ప్రమాదముందని భయపడి ఆ సంబంధాన్ని వదులుకుంది.

"రేపోమాపో వుద్యోగం దొరుకుతుంది. నీకా భయం అక్కర్లేద" న్నాడు రామ్మూర్తి.

ఆ రేపు ఎప్పటికొస్తుందోనని కాదంది.

రెండవసారి రఘు వచ్చాడు. అతనికి ఒక తల్లి తప్ప ఎవరూ లేరుట. మధ్యవర్తి ద్వారా కబురు చేశారు.

తనకు సాయంగా వుంటుందని తన ఆఫీసులో పనిచేసే శారదని రమ్మంది తను.

తీరా అతన్ని చూడగానే - అతని తల్లికి క్షయ అనీ, మందులకి లొంగక ముదిరిపోయిందని, అతను తనకు బాగా తెలుసని చెప్పింది శారద.

ఈ పెళ్ళి చేసుకుని తాను అక్కడ సుఖపడేదేమీ వుండదని భయపడి మానేసింది.

మూడవసారి రాజారావు వచ్చాడు. అతను స్టేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. అతనితోపాటు రవి వచ్చేడు. రవి, అతను కలిసి పనిచేస్తున్నారు. అప్పుడే

తనకు రవితో పరిచయమైంది.

రాజారావు విడిగా బాగానే వున్నాడు గానీ, తన ప్రక్కన పొట్టిగా కనిపిస్తాడు. పొట్టిగా వుండటం వలన కుదేసిన గూటంలా వున్నట్లనిపించాడు. వరహీనం అవుతుందని అతన్ని కాదంది.

నాల్గవసారి నరేంద్ర వచ్చాడు.

ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టింది.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే అందరూ కారణమడిగారు. వివరించింది.

"అతనా ! అతను గొప్ప గ్రంథకారుడు" అంటూ అతని రాసక్రీడలను వివరించారు. చూడటానికి ముచ్చటగా వున్న నరేంద్ర వెనకాల వున్న కథ, అతనంటే భయాన్నీ, అసహ్యాన్నీ కలిగించింది.

అతనితో తన నిర్ణయాన్ని చెప్పినప్పుడు అతనెంతో బాధపడ్డాడు.

నిజానిజాలు తనకి తెలీకపోయినా, అతని బాధ మాత్రం నటనే అని సమర్థించుకుంది.

ఐదవసారి ప్రసాద్ వచ్చాడు.

అతనితోపాటు అతని తండ్రి కూడా వచ్చాడు.

ప్రసాద్ అన్ని విధాలా తనకు నచ్చాడు. అతనికి తను నచ్చిందా లేదా అనే అనుమానమే లేదు.

కానీ, చివరికి వాళ్ళు వెళ్ళిపోతున్నప్పుడు అప్రయత్నంగా తన చూపులు ప్రసాద్ తండ్రి కాళ్ళమీద ఆగినై.

వళ్ళు జలదరించింది. కాళ్ళ నిండా తెల్లటి బొల్లి మచ్చలు.

అంతే ! ఆ సంబంధం అక్కడితో ఆగిపోయింది.

విసిగిపోయిన తన ప్రాణం తప్పనిసరిగా ఆరోసారి కృష్ణను ఆహ్వానించింది.

అతని ఆకారం, ఉద్యోగం, జీతం అన్నీ తనకి నచ్చాయి.

కానీ, అతనికి వెనకాల గంపెడు సంసారం. అతనే పెద్దకొడుకు. అతనితో పాటు ఆ బాధ్యతల్ని తను కూడా పంచుకోవాలనీ, తనకిక స్వేచ్ఛగా కాలం గడపడం అనేది వుండదనీ, పంజరంలో పక్షి బ్రతుకులా అవుతుందని భయపడి ఆ సంబంధాన్ని వొదులుకుంది.

ఈ మధ్యలో రవితో పరిచయం పెరిగింది.

ఉన్నట్లుండి ఇంటివాళ్ళు ఇల్లు అవసరమైందనీ ఖాళీ చెయ్యమని అడగడంతో ఇరుకునపడింది. ఉన్న ఇల్లు ఆఫీసుకు దగ్గరగా వుంది. మళ్ళీ ఇళ్ళ వేటలో పడక తప్పలేదు.

ఆ సాయంత్రం రవి కలిసినప్పుడు ఇంటిని గురించి చెప్పింది. అతని సాయం కోరింది.

తమ ఇంట్లో వాటా ఖాళీగా వుందనీ, అభ్యంతరం లేకపోతే రేపే వచ్చి చేరమని చెప్పాడు.

మర్నాడే వచ్చి చేరింది. ఈ ఇంట్లోకి వచ్చి ఇంకా ఏడాది అవలేదు.

సరస్వతమ్మ ఎంతో ఆపేక్షగా కన్న కూతురిలా చూసుకుంటోంది.

ఆరు నెలల నాడు తను పనిచేస్తున్న ఆఫీసుకు కొత్తగా వచ్చిన ఆనంద్ తనకు బాగా దగ్గరయ్యేడు. వారం రోజుల నాడు తన అభిప్రాయాన్ని బయటపెట్టాడు.

తనకూ అభ్యంతరాలేమీ కనిపించలేదు.

అతని చెల్లెలు తనని చూడాలనీ, ఫలానా రోజు వస్తామనీ చెప్పాడు.

ఆ ముచ్చట కూడా ఈ రోజు తీరిపోయింది.

అతని చెల్లెలు ఇంత గడుసుదని తాననుకోలేదు. ఎలాగైనా భరించటం కష్టమే.

కలత నిద్రతోనే తెల్లవారింది సరోజకు.

భోజనం చేసి తీరికగా పేపరు చదువుకుంటూ కూర్చుంది సరోజ.

"నిద్రపోతున్నావా" అంటూ వచ్చింది సరస్వతమ్మ.

ఆవిడ మంచి స్థూలకాయురాలు, నిశితమైన చూపు, మంచి వాగ్ధాటి కల వ్యక్తి. ఆవిణ్ణి చూసినవాళ్ళెవరికైనా గౌరవ భావం కలిగి నమస్కరించ బుద్ధవుతుంది.

"రండి" అంటూ పేపర్ ప్రక్కన పడేసింది సరోజ.

ఆవిడ వచ్చి సరోజకు కాస్త పక్కగా గోడకు ఆనుకొని కూర్చుంది.

ఆవిడ ఏదో చెప్పాలనే వుద్దేశ్యంతో వున్నట్లు అర్థం చేసుకుంది సరోజ.

ఇంతలో సరస్వతమ్మే మొదలెట్టింది, "మళ్ళీ అడుగుతున్నానని ఏమీ అనుకోకు. ఏం నిర్ణయించుకున్నావ్?".

సరోజ ఏం మాట్లాడలేదు. నేలచూపులు చూస్తూ కూర్చుంది.

ఆ మౌనంలోని అర్థాన్ని గ్రహించలేనంతటి అమాయకురాలు కాదు సరస్వతమ్మ.

"సరే ... నీ యిష్టం, నేను నీకు ఓ కథలాంటి నిజాన్ని చెప్తాను. అది విన్న తరువాతయినా నీ అభిప్రాయాన్ని మార్చుకుంటే సంతోషిస్తాను. అన్నట్టు మధ్యాహ్నం ఏ సినిమాకయినా వెళ్తావా? వెళ్ళనంటే చెప్తాను ..." అర్థోక్తిగా సరోజ వైపు చూస్తూ అందావిడ.

ఓ గంట ముందు బయలుదేరి శారదను తీసుకుని సినిమాకు వెళ్ళాలనుకున్న తన నిర్ణయాన్ని మనస్సులోనే కేన్సిల్ చేసుకుంది.

"అబ్బే - ఎక్కడికీ వెళ్ళడం లేదండీ. చెప్పండి వింటాను ..." అంటూ సర్దుకుని కూర్చుంది - సరోజ.

"నలుగురు అన్నదమ్ములు, నలుగురు అక్కచెల్లెళ్ళు ఉన్న ఇంట్లో పెద్ద కూతురిగా పుట్టింది లక్ష్మి.

మొదటి కానుపు గనుక కొన్ని ముచ్చట్లు బాగానే జరిగాయి.

లక్ష్మి తల్లికి పది కాన్పులూ జరిగేసరికి ఇంట్లో ఇక్కట్లు ప్రారంభమయ్యేయి.

లక్ష్మి కాలేజీ చదువు మధ్యలో వుండగానే తండ్రి పోయేడు.

వస్తున్న స్కాలర్‌షిప్‌తో డిగ్రీ పూర్తి చేసింది.

ఉన్న కాస్త పొలాన్నీ అమ్మేసి, వచ్చిన డబ్బు బ్యాంకిలో వేసి జాగ్రత్తగా గడుపుకొచ్చింది కొన్నాళ్ళు.

ఆ డబ్బు అయిపోతే, తరువాత తాము అనుభవించబోయే ఇబ్బందుల్ని తలచుకుని - ముందు జాగ్రత్తగా ఉద్యోగాల వేట ప్రారంభించింది.

ఒకరోజు మార్కెట్ నుంచీ వస్తుంటే కాలేజీ నాటి ఫ్రెండ్ కనిపించింది.

కుశల ప్రశ్నల తరువాత ఇంటి ప్రసక్తి వచ్చింది. తనకు ఉద్యోగపు అవసరాన్ని వివరించి చేతనైతే సహాయం చెయ్యమంది లక్ష్మి.

"రేపు మా యింటికి రా, మా నాన్నగారితో చెప్తాను" అంటూ అడ్రసిచ్చింది ఆ ఫ్రెండ్.

అనుకున్న టైముకి వాళ్ళ యింటికెళ్ళింది లక్ష్మి.

ఎక్కడికో వెళ్ళబోతున్న వాడల్లా లక్ష్మిని చూసి ఆగేడు స్నేహితురాలి తండ్రి.

వివరాలు తెలుసుకున్నాడు. 'నీకు వుద్యోగం వచ్చినట్లే' అని హామీ ఇచ్చేడు.

ఆయన పుణ్యమా అని అక్కడే వున్న హైస్కూల్లో టీచర్ వుద్యోగం వచ్చింది.

జీతంతోనూ, ప్రైవేట్ల మూలంగా వచ్చిన డబ్బుతోనూ, తమ్ముళ్ళ, చెల్లెళ్ళ అవసరాలు తీర్చడమే కాక విద్యావకాశాలు కల్పించింది. పెద్ద చదువులు చదివించింది. వాళ్ళతోపాటుగా తాను ఎం.ఏ. పూర్తి చేసింది. లెక్చరరుగా స్థిరపడిపోయింది.

తోడబుట్టిన వాళ్ళందరికీ మంచి సంబంధాలు చూసింది. పెళ్ళీ, పేరంటాలు చేసింది.

ఎవరి దారిన వాళ్ళు రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోయారు.

అంతవరకూ కాకాపట్టి తమ అవసరాలు తీర్చుకున్నవాళ్ళంతా లక్ష్మిని

పట్టించుకోవడం మానేశారు. లక్ష్మి వయసు, మనసు గ్రహించాల్సిన అవసరం లేకపోయిం దెవ్వరికీ.

ఇంత జీవితం జరిగిపోయాక తనని తాను అద్దంలో చూసుకుంది లక్ష్మి.

కాలం తనకేం మిగిల్చింది అని ప్రశ్నించుకుంది.

నెరిసిపోతున్న జుట్టునీ, ముడుతలు రాబోతున్న శరీరాన్నీ, తీరని అలసటనీ, చెరగని నైరాశ్యాన్నీ, చెదరని గుండె ధైర్యాన్నీ, నలభై ఏళ్ళ వయసునీ మిగిల్చింది.

కానీ, తాను అనుభవించటానికి తన జీవితమేమీ మిగల్చలేదన్న సత్యం ఆమె కంటిలో నీరు తెప్పించింది.

అకస్మాత్తుగా పక్షవాతంతో మంచాన పడిన తల్లిని చూసేసరికి లక్ష్మి మనసు గిజగిజలాడింది. వున్న గుండె ధైర్యం సడలింది.

ఎన్ని మందులు వాడినా లొంగలేదు తల్లి జబ్బు. పైగా లక్ష్మికి తోడెవ్వరూ లేరనే విషయం ఆ ముసలితల్లి గుండె తొలిచేయడం ప్రారంభించింది.

ఒకరోజు లక్ష్మిని దగ్గరకు పిలిచింది. "నిన్ను నీ చెల్లెళ్ళు, తమ్ముళ్ళు పూర్తిగా మరిచిపోయారు. వాళ్ళ అవసరాలకు వుపయోగించుకునే నీ డబ్బు తప్ప వాళ్ళకు నీ అవసరం లేదు. వాళ్ళను ఇప్పుడున్న స్థితికి నువ్వే తీసుకొచ్చిన విషయం వాళ్ళకు గుర్తులేదు. నేను మంచాన పడిన ఈ ఆరు నెలలనుంచీ నువ్వెన్ని వుత్తరాలు వ్రాసేవ్, ఒకరు కాకపోతే ఒకరన్నా వొచ్చి నన్ను చూశారా? తల్లినైన నేనే వాళ్ళకు గుర్తు లేదు. ఇంక నువ్వేం గుర్తుంటావు. ఇప్పటికైనా నా మాట విని నీదనే ఒక తోడుని ఏర్పాటు చేసుకో. ఇరవై ఏళ్ళ నుంచీ చెప్పి చెప్పి విసిగిపోయింది నా ప్రాణం. ఇక నీ యిష్టం. నే నెన్ని రోజులో బ్రతకను. బ్రతికినా నీకు భారమౌతానే గానీ, నీ సమస్యకు పరిష్కారాన్ని మాత్రం కాను" అలసటలో చివరి వాక్యాన్ని సరిగా పలకలేకపోయింది.

మర్నాడు - ఈ లోకం నుంచే నిష్క్రమించింది లక్ష్మి తల్లి.

చావు కబురు తెలిసి కూడా అందరూ రాలేదు. వచ్చినవాళ్ళు మొక్కుబడిగా

వెంటనే వెళ్ళిపోయారు.

ఏకాకిగా మిగిలింది లక్ష్మి.

అప్పుడు తెలిసింది లక్ష్మికి - తానింతవరకూ ఎలాంటి జీవితాన్ని కోల్పోయిందో ! అయినా తన పిచ్చిగానీ, ఇప్పుడు తన నెవరు పెళ్ళి చేసుకుంటారు?

రోజులు దొర్లిపోతున్నై -

"ఎందుకండీ, ఈ మధ్య మీరు ఉత్సాహంగా ఉండటం లేదు. దిగులుగా కనపడ్తున్నారు. మీకు అభ్యంతరం లేకపోతే కారణం తెలుసుకోవచ్చా?"

తోటి లెక్చరర్ రాఘవరావు లక్ష్మిని అడిగేడు.

ఆరేళ్ళ నుంచీ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారు. అతని భార్య పోయి అయిదేళ్ళయింది. పిల్లలు లేరు.

ఆ రోజున -

అతని భార్య పోయినప్పుడు తనే ధైర్యం చెప్పింది.

ఈ రోజు - తనని అనునయిస్తున్నాడు. నవ్వుకుంది లక్ష్మి. తన పరిస్థితి అంతా అతనికి విప్పి చెప్పింది.

అంతా విన్నాడు. "ఈ రాత్రికి ఆలోచించి రేపు నా సలహా చెప్తాను. సరేనా..." అన్నాడు. 'సరే' అన్నట్లు తలవూపింది లక్ష్మి.

మర్నాడు, అతను చెప్పిన సలహా విన్న లక్ష్మి నిర్ఘాంతపోయింది. ఆమె కళ్ళల్లో సన్నటి నీటి తెర కదిలింది.

"మీకు అభ్యంతరం అయితే చెప్పండి. ముందుగా మీ మనస్సెలా వున్నదీ తెలుసుకోకుండానే నా వుద్దేశాన్ని బయటపెట్టాను. మిమ్మల్ని బాధపెట్టినట్లున్నాను, క్షమించండి...".

"ఆగండి"

ఆమె మాటలకు ఏమిటన్నట్లుగా నిలబడ్డాడు. చటుక్కున ముందుకు

నడిచి అతని కాళ్ళకు నమస్కారం చేసింది. అనుకోని ఆమె ప్రవర్తనకు అతను నిర్ఘాంతపోయేడు.

ఆ నెలలోనే ఇద్దరూ రిజిష్టరు మారేజి చేసుకున్నారు.

కులం, మతం ఇవేవీ ఆలోచించలేదు వాళ్ళు. ఇద్దరికీ మిగిలిన జీవితం గడపడానికి ఒక తోడు కావాలి. ఒకరికొకరు అండగా నిలిచి సుఖమైన జీవితాన్ని గడిపేరు.

ఆ తరువాత ఉద్యోగానికి రిజైన్ చేసి, తాను కోరుకున్న విధంగా ఇల్లు దిద్దుకుంది లక్ష్మి.

మళ్ళీ ఏడాదికి కొడుకు కూడా కలిగేడు.

అప్పుడు ఆమె అనుభవించిన తృప్తిని మాటల్లో వివరించలేను.

ఒక విషయం అడుగుతాను చెప్పు. నీకు ఆ లక్ష్మికి వచ్చిన సమస్యలు కానీ, బరువు బాధ్యతలు కానీ ఏమైనా వున్నాయా? లేవు. అయినా, నువ్వు వచ్చిన ప్రతి సంబంధాన్నీ ఏదో ఒక వంకపెట్టి పంపుతున్నావు. నీ వయస్సంతా అడవి కాచిన వెన్నెల చేసుకొంటున్నావు. వయస్సులో ఎంతో ధైర్యంగా బ్రతికినా, వున్న వోపిక కాస్తా హరించేటప్పటికి నీకో తోడు కావాలని తప్పనిసరిగా అనిపిస్తుంది".

అలుపు తీరదాని కన్నట్టు కాస్సేపు ఆగింది సరస్వతమ్మ.

నీ సమాధానం ఏవిటన్నట్టు సూటిగా సరోజ కళ్ళలోకి చూసింది ఆమె. సరోజ తలవంచుకుంది.

"లక్ష్మి ఎవరో అనుకుంటున్నావు కదూ. నేను నీ కోసం కల్పించిన పాత్ర అని కూడా అనుకుంటున్నావు కదూ. కానీ ఆ లక్ష్మిని నేనే .... నేనే".

సరస్వతమ్మ గొంతు జీరపోయింది. ఉద్విగ్నంగా వెనక్కు వాలి కళ్ళు మూసుకుంది.

క్షణాల తర్వాత నూతిలో నుంచి అంటున్నట్టు అన్నది, "తరువాత అయిదేళ్ళకు ఆయన పోయినా కూడా రవిని చూసుకుని బ్రతుకుతున్నాను ...".

నిర్ఘాంతపోయినట్లుగా చూస్తుండిపోయింది సరోజ.

సరోజ మనస్సులో అనేక ఆలోచనలు చోటు చేసుకుంటున్నై - ఒకే సెల్‌లో కుక్కిన ఖైదీల్లా, గాలి స్థంభించినట్లయింది. నుదురంతా చెమట పట్టింది. ముఖంమీద పడ్డ వెంట్రుకల్ని సవరించుకుంది.

ఆనంద్ రూపం కళ్ళముందు మెదిలింది. రమణి మాటలు చెవుల్లో మార్మోగినై. ఏవేవో భయాలూ, అనుమానాలు వలయాలు వలయాలుగా కదిలేయి. మలిగేయి. వాటన్నింటినీ వెనక్కి తోస్తూ - రవి ప్రత్యక్షమైనాడు.

"వయస్సులో వున్నప్పుడు తెలీకపోయినా, జీవితంలో ఎప్పటికైనా ఒక తోడు అవసరమనే నా అభిప్రాయం".

"మరి ఇన్ని అభిప్రాయాలున్నవాడివి నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదు"

"ఇప్పుడు చేసుకోవాలనే అనుకుంటున్నాను"

అతని మాటలు సరోజ చెవుల్లో ఏవేవో వూసులు చెప్తున్నట్లన్పించేయి.

తాను ఇంతకాలంగా అన్వేషిస్తున్న ఆత్మ ఇంత దగ్గరలోనే వుందని తెలిసి ఆశ్చర్యపోయింది - సరోజ.

ఇప్పుడంతా ఆనందంగా హాయిగా వుంది గాలి. ప్రక్కవీధిలో సన్నాయి మ్రోగుతోంది.

(యువ జనవరి, 1984)